సాక్షి
సూర్యాపేట

మంగళవారం : 30 : మే : 2023



భూపోరాటం మళ్లీ మొదలైంది
తెలంగాణలో భూపోరాటం మళ్లీ మొదలైందని ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. - 8లో



నిరంకుశత్వంపై పోరాడుదాం
ప్రధాని నరేంద్రమోదీ నిరంకుశ విధానాలపై పోరాడుదామని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రేణుక అన్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
43°/29°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

1న బొత్తలపాలెంలో రచ్చబండ

పాలకవీడు: పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో జూన్ 1న పాలకవీడు మండలంలోని బొత్తలపాలెం గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ వేదిక జిల్లా కార్యదర్శి భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కర పత్రాలను పంపిణీ చేశారు.

4న సురక్షా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 4వ తేదీన పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ కూడా నిర్వహిస్తామన్నారు. దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ఏర్పడిన పదేళ్లలో ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ అమలు చేస్తున్న విధి విధానాలు, సాధించిన విజయాలు, బ్లూకోర్ట్స్, పెట్రో కార్స్, షీ టీమ్స్, భరోసా సెంటర్, డయల్ 100కాల్, పాస్పోర్ట్ వెరిఫికేషన్, పోలీసు పని విభాగాల అమలు మొదలగు అంశాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. 12వ తేదీన ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరినీ కలుపుకొని పోలీసు శాఖ నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోలీస్ గ్రీవెన్స్ డేలో 10 ఫిర్యాదులు

పోలీస్ గ్రీవెన్స్ డేలో 10 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి మాట్లాడారు. ఫిర్యాదులపై వేగంగా చర్యలు తీసుకొని బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

మఠంపల్లి: మఠంపల్లిలోని వీవీ పాఠశాల గ్రౌండ్‌లో ఈనెల 31నుంచి జూన్1 వరకు రెండు రోజులపాటు 4వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి తరుణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఈపోటీల్లో తెలంగాణలోని 25జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొంటారని వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు భోజనం, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీఈటీ సతీష్, సీనియర్ రగ్బీ క్రీడాకారులు వినోద్‌నాయక్, సుమన్‌నాయక్, రజిత పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం నిరంతర పోరాటం



విమలక్కను సన్మానిస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు

కోదాడ: మహిళల హక్కుల కోసం జరిగే ప్రతి కార్యక్రమంలో తాను ముందుండి పోరాడతానని, పోరాడే వారికి అండగా ఉంటానని అరుణోదయ సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. సోమవారం కోదాడలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన స్నేహిత ఉమెన్స్ ఆర్గనైజేషన్ ద్వితీయ వార్షికోత్సవంతో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి మహిళ తాను అభివృద్ధి చెందుతూ తోటి వారికి అండగా నిలబడాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలని కోరారు. సమాజంలో సగం మంది మహిళలున్నారని వారంతా ఏకమై హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటే సమాజానికి మంచి జరుగుతుందన్నారు. కోదాడలో స్నేహిత ఉమెన్స్ ఆర్గనైజేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఇతర ప్రాంతాల మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు మాతంగా శైలజ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దరువు అంజన్న, పూరి సోమన్న, మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్యబాబు, డాక్టర్ బ్రహ్మం, ముత్యాలు, పంది తిరపతయ్య పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని, అర్హత లేని వారికి కేటాయించిన ఇళ్లను రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లి సైదులు డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మోతె మండలం విభళాపురం, అప్పన్నగూడెం గ్రామపంచాయతీల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని కోరారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై, ఒక్కో ఇంటికి రూ. 7లక్షలు తీసుకొని అర్హత లేని వారికి మంజూరు చేశారని ఆరోపించారు. ఈ విషయమై అనేక సార్లు కలెక్టర్ ,ఆర్డీఓ ,తహసీల్దార్‌కు తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విభళాపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించి అర్హత లేని వారిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మోతె మండల కార్యదర్శి మల్కారి గోపాల్ రెడ్డి, నాగం మల్లయ్య, బూడిద లింగయ్య, వెలుగు మధు చేగువేరా, ఎల్లయ్య, వీరమల్ల వెంకట్, పెరుమాండ్ల నాగమణి, కళ్లపల్లి సుగుణమ్మ, పులిగుజ్జు ఉప్పమ్మ , తురక రమేష్, కొండ రమణ , గోపి, రమణ, విజయ , సంద్ర ఉప్పలమ్మ, రజిత, మధు, నిర్మల, పూలమ్మ పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నాం

- కలెక్టర్ ఎస్.వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అదనపు కలెక్టర్, ఎస్పీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లాల కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌లతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. దశాబ్ది వేడుకలకు జిల్లాలో చేపడుతున్నఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించడానికి శాఖల వారీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు ఫుడ్ కమిటీ, ఇన్విటేషన్ కమిటీ, డ్రింకింగ్ వాటర్ కమిటీ, డాక్యుమెంటేషన్ కమిటీ, కల్చరల్ యాక్టివిటీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్పీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జూన్ 2, 4 ,12 తేదీల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని, స్నేహపూర్వక విధానాన్ని, సమర్థవంతమైన సేవలను వివరించేలా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీఈఓ అశోక్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ, బీసీ సంక్షేమ అధికారి అనసూయ , జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్, సివిల్ సప్లై డీఎం రాంపతి , ఉద్యానవన అధికారి శ్రీధర్, డీపీఓ యాదయ్య, సీపీఓ వెంకటేశ్వర్లు, , మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, డీఎస్పీ నాగభూషణ, రవికుమార్, ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

30 ఏళ్లకే బీపీ, షుగర్

అసంక్రమిత వ్యాధుల బారిన పడుతున్న యువత

- ప్రతినెలా 300మందికి జబ్బులు
- మారిన జీవనశైలి, పనిభారం, మానసిక ఒత్తిళ్లతో రోగాల పాలు
- వైద్య పరీక్షల నివేదికల్లో వెల్లడి



జిల్లాలో 30 ఏళ్లు నిండిన వారి సంఖ్య	5,71,917
అధిక రక్తపోటు ఉన్నవారి సంఖ్య	66,200
మధుమేహం వ్యాధిగ్రస్తుల సంఖ్య	42,878

నాగారం : మారిన జీవన శైలి.. మానసిక ఒత్తిళ్లు, పని భారం కారణంగా మధుమేహం, అధిక రక్త పోటు బాధితులు పెరుగుతున్నారు. మూడు పదులు దాటని యువత కూడా జబ్బుల బారిన పడుతోంది. వ్యాయామం, యోగా, నడక లేకపోవడం, ఆరోగ్యంపై అవగాహన రాహిత్యంతో వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. పట్టణాల్లో నివసించే వారితో పాటు కష్ట జీవులు కూడా వ్యాధుల బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముందస్తుగా పరీక్షలు చేసుకోవాలనే ఆలోచన లేకపోవడం, వ్యాధి సోకితేనే వైద్యులను ఆశ్రయిస్తుండటంతో జబ్బుల బారిన పడ్డాక కూడా గుర్తించలేకపోతున్నారు. ప్రతి వారం గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షల నివేదికలు వ్యాధుల తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నా చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు.

వారానికోసారి పరీక్షలు..

జాతీయ ఆరోగ్య సంస్థ రూపొందించిన సమగ్ర ఆరోగ్య పరీక్ష పత్రంలో 30 సంవత్సరాలు నిండిన స్త్రీ, పురుషుల ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, నాలుగు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వారానికోసారి 57 రకాల రక్త, మూత్ర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా వారి ఆరోగ్య వివరాలను వైద్యాధికారులు తెలుసుకునే అవకాశం ఉంటుంది. అలాగే ఎత్తు, బరువుతో పాటు గ్లూకోమీటర్ ద్వారా మధుమేహం, రక్త పోటు పరీక్షలు చేస్తున్నారు. రోగులకు అసంక్రమిత వ్యాధి కిట్లను అందిస్తున్నారు.

రోజూ వ్యాయామం తప్పని సరి



అసంక్రమిత వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు రోజూ అరగంటపాటు వ్యాయామం చేయాలి. ఆహార అలవాట్లు, ఇతర కారణాలతో రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందాలంటే ప్రతిఒక్కరు తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలి, చక్కెర, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు సాధ్యమైనంత తక్కువగా తీసుకోవాలి. చిన్నారులు, యువత జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.

– డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి, సూర్యాపేట

ఇంటింటి సర్వేలో..

జిల్లాలో మధుమేహం, అధిక రక్తపోటు వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోందిది. ప్రతి నెలా సగటున 300 మంది వరకు కొత్తగా వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబొరేటరీల్లో నిర్వహించే పరీక్షల గణాంకాలు తేలడంలేదు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో నిర్వహించే ఇంటింటి సర్వేలో మాత్రమే ఈ వివరాలు తేలుతున్నాయి. జిల్లాలో 30 ఏళ్లు నిండిన వారు 5,71,917 మంది ఉండగా, వీరికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ స్క్రీనింగ్ పరీక్షల్లో జిల్లాలో 66,200 మంది అధిక రక్తపోటు, 42,878 మంది మధుమేహం తో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి ఎన్‌సీడీ మందుల కిట్లు పంపిణీ చేస్తారు. బీపీ, షుగర్ అనుమానితులు తమకు వచ్చిన జబ్బులు అదుపులో ఉన్నాయా లేదా అని తరుచూ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌దే అధికారం

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నాంపల్లి : తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్‌దే అధికారమని రాష్ట విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నాంపల్లి మండలం పసునూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్తా పని చేయలని కోరారు. ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతారవీందర్‌రెడ్డి, గీత కార్మిక ఆర్థిక సహకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పల్లె రవికుమార్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుమ్మడపు నర్సింహారావు పాల్గొన్నారు.

సగం మందికి అందని రేషన్ బియ్యం

- రేషన్ షాపులకు ఆలస్యంగా బియ్యం సరఫరా
- లారీల కొరతే కారణమంటున్న సివిల్ సప్లయ్ అధికారులు
- 25వ తేదీనే ముగిసిన బియ్యం పంపిణీ గడువు
- రేషన్ దుకాణాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు



నాగారంబంగ్లాలో లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

నాగారం : రేషన్ బియ్యం ఈ నెలలో సగం మందికి అందనేలేదు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం ఎగుమతులు, దిగుమతుల కారణంగా తీవ్రంగా లారీల కొరత ఏర్పడింది. దీంతో రేషన్ బియ్యం సరఫరా చేసే బఫర్ స్టాక్ పాయింట్స్(బియ్యం నిల్వ కేంద్రాలు)ల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ (మండల్ లెవల్ స్టాక్‌పాయింట్)లకు బియ్యం సరఫరా ఆలస్యంగా జరిగింది. ఈనెల25వ తేదీ వరకు బియ్యం సరఫరా జరగడం అదే రోజు చివరి రోజు కావడంతో అందరూ తీసుకోలేకపోయారు. వాస్తవంగా ప్రతి నెలా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు 5వ తేదీ వరకు బియ్యం సరఫరా చేస్తారు. అదే రోజు నుంచి రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంటారు. కానీ ఈ నెలలో లారీ కొతరతో ఎంఎల్ఎస్ పాయింట్‌లకు అరకొరగా బియ్యం దిగుమతులు జరిగాయి. దీంతో రేషన్ షాపులకు బియ్యం సరఫరా సకాలంలో జరగలేదు. దీంతో రేషన్ దుకాణాల్లో స్టాక్ లేక చాలా చోట్ల లబ్ధిదారులకు డీలర్లు బియ్యం పంపిణీ చేపట్టలేదు. దీంతో రేషన్‌షాపుల చుట్టూ తిరుగుతున్నారు.

నష్టపోయిన లబ్ధిదారులు ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌కార్డు కలిగి ఉన్న లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాయి. రేషన్ దుకాణాల ద్వారా ప్రతినెలా 5 నుంచి లబ్ధిదారులు తమకు రావాల్సిన కోటా బియ్యాన్ని తీసుకెళ్తుంటారు. రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా సకాలంలో కాక లబ్ధిదారులకు డీలర్ల చాలా చోట్ల పంపిణీ చేయలేదు. దీంతో జూన్‌లో రెండు నెలలకు సంబంధించిన 12 కేజీల బియ్యం ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


కొందరికి అందకపోవచ్చు

లారీల కొరతతో ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం ఆలస్యంగా వచ్చాయి. అయినప్పటికీ ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి అన్ని రేషన్ షాపులకు బియ్యాన్ని సరఫరా చేశాం. రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ మే-25న నిలిపివేయడంతో డీలర్ల నుంచి కొంత మంది లబ్ధిదారులకు బియ్యం అందకపోవచ్చు.

– ఎ.యాదగిరి, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్

నాయకత్వ లక్షణాలపై శిక్షణ

- ఉపాధ్యాయుల కోసం ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చిన కేంద్రం
- శిక్షణ పూర్తి చేసిన వారికి ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రం



తిరుమలగిరి (తుంగతుర్తి): జూన్ 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, పాఠశాల నిర్వహణ ఎలా చేయాలనే విషయంపై కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చింది. మార్పుతో కూడిన బోధన, ఉపాధ్యాయుల భాగస్వామ్యం పెంచడం, సూక్ష్మ దృష్టి తదితర అంశాలపై కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) ఆధ్వర్యంలో జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలన యూనివర్సిటీ (న్యూపా) ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్లు, యూడైస్ కోడ్‌తో పేర్లు నమోదు చేసుకుంటే శిక్షణలో భాగస్వాములు కావొచ్చు.

శిక్షణ ఇచ్చే అంశాలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విస్తరణ ఏటా పెరుగుతుంది. ప్రస్తుతం 2 వేలకు పైగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, గురుకుల ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ కళాశాలలు 50కి పైగా ఉన్నాయి. సుమారు 2 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరికి బోధన చేసేందుకు 15 వేల మందికి పైగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఉత్తమ ఫలితాల సాధనలో పాఠశాలలు ఆశించిన వృద్ధి సాధించడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం, నాయకత్వం, సమర్థ నిర్వహణ, అభివృద్ధి అనే ఆన్‌లైన్ కోర్సును ప్రారంభించింది. ఇందులో 7 అంశాలపై ప్రధానంగా శిక్షణ ఉంటుంది. పాఠశాల నాయకత్వ దృక్పథం, స్వీయ అభివృద్ధి, బోధన అభ్యసన ప్రక్రియ మార్చడం, బిల్డింగ్, లీడింగ్ బృందాల సృష్టి, ప్రముఖుల ఆవిష్కరణలు, ప్రముఖ భాగస్వామ్య పాఠశాల పరిపాలన, పాఠశాల అభివృద్ధి ప్రణాళికలను ఏకీకృతం చేయడం అనే అంశాలపై ఈ కోర్సుల్లో రెండున్నర నెలలు శిక్షణ ఇవ్వనున్నారు. వీటిని ఉపాధ్యాయులు పూర్తిగా ఆకలింపు చేసుకుంటే వారిలో ప్రమాణాలు మెరుగవ్వనున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన వారికి 3 నుంచి 10 రోజుల్లో ఆన్‌లైన్ ధ్రువపత్రం అందించనున్నారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

నాయకత్వ లక్షణాలపై శిక్షణ పొందేందుకు www.pslm.niepa.ac.in వెబ్‌సైట్‌లో పేరు, వివరాలు, మెయిల్ ఐడీ, ఉద్యోగి సంఖ్య, చిరునామా తదితర వివరాలు నమోదు చేసుకొని యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. కోర్సు ప్రారంభమైన రోజున వెబ్‌సైట్‌ను ప్రారంభించి అందులో స్టడీ మెటీరియల్‌తో సబ్జెక్టుపై అవగాహన పెంపొందించుకోవచ్చు. తరువాత ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యతగ్నిహోత్రి, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పపంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణ తంతును ముగించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శివాలయంలో విశేష పూజలు



శివపార్వతుల సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు చేపట్టారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో నిత్య కైంకర్యాలతో పాటు మండపంలో నిత్య రుద్ర హవనం నిర్వహించారు. అనంతరం అభిషేకం, అర్చనలు గావించారు. ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. శివపార్వతుల కల్యాణం, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక యాదాద్రీశుడి ప్రధానాలయంలో సుప్రభాతం, అర్చనలు, అభిషేకం, సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం నిర్వహించారు.

అనర్హులకు దివ్యాంగుల సర్టిఫికెట్!

- మానసిక స్థితి సరిగా లేదంటూ ధ్రువీకరణ పత్రాలు జారీ
- అధికారులను మచ్చిక చేసుకుని మధ్యవర్తుల దందా
- ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.40వేలు డిమాండ్
- జెర్రిపోతులగూడెంలో 20మంది అనర్హులు పింఛన్ పొందుతున్నారని ఆరోపణలు



జెర్రిపోతులగూడెం పంచాయతీ కార్యాలయం

చిలుకూరు : ప్రతి నెలా ప్రభుత్వ పింఛన్ పొందేందుకు పలువురు అడ్డదారులు తొక్కుతున్నారు. కొందరు మధ్యవర్తులు జిల్లా కేంద్రంలోని అధికారులను మచ్చిక చేసుకుని అనర్హులకు దివ్యాంగుల (మానసిక స్థితి సరిగా లేదని) ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించే దందాకు తెరలేపినట్లు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో ధ్రువీకరణ పత్రానికి రూ.30నుంచి 40వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే, జీవితకాల పింఛన్ పొందే అవకాశం ఉండడంతో ధ్రువీకరణ పత్రం కోసం అనర్హులు డబ్బుకు వెనుకాడడం లేదని సమాచారం.

మధ్యవర్తులుగా అధికార పార్టీ నాయకులు

చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు అధికార పార్టీకి చెందిన నాయకులు కొంతకాలంగా సదరమ్ సర్టిఫికెట్లు ఇప్పించే దందా సాగిస్తున్నట్లు తెలిసింది. గ్రామంలో ఆర్థికస్థోమత కలిగి ఉన్న వారిని గుర్తించి సదరమ్ సర్టిఫికెట్‌తో కలిగే ప్రయోజనాలు వివరించి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఇలా గ్రామంలో సుమారు 20మందికి మానసిక స్థితి సరిగా లేదని ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించడంతో ఇప్పుడు వారంతా పింఛన్ పొందుతున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది.

ముందే డబ్బులు తీసుకుని..

కాగా, సదరమ్ సర్టిఫికెట్ కోసం మధ్యవర్తులు ముందుగా అనర్హుల నుంచి డబ్బులు తీసుకుంటారు. ఆ తర్వాత ఎవరైతే డబ్బులు ఇచ్చారో వారికి మెంటల్ (మానసిక స్థితి సరిగా లేదని) అని ముందుగా తమకు అనుకూలంగా ఉండే బేతవోలు మీ సేవ కేంద్రాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రకటించిన తేదీల్లో సదరమ్ క్యాంప్‌లో బుకింగ్ చేస్తారు. ఇందుకు తక్కువ సమయం ఉండడంతో మీ సేవ కేంద్రం నిర్వాహకులు బుకింగ్ సమయంలో సాధారణంగా వచ్చే వారిని పక్కన పెట్టి అనర్హులకు బుకింగ్ చేస్తారు. ఆ తర్వాత అనుకున్న ప్రకారం జిల్లా కేంద్రంలో సంబంధిత అధికారులకు డబ్బులు ఇచ్చి పింఛన్ పొందేందుకు కావాల్సిన దివ్యాంగుల శాతాన్ని వేయించుకుని ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని తెలిసింది. ఇలా ఒక్క జెర్రిపోతులగూడెంలోనే 20మంది అనర్హులు దర్జాగా ప్రతి నెలా పింఛన్ తీసుకుంటున్నారని సమాచారం. అంతేకాక దివ్యాంగుల పెన్షన్లలో సదరమ్ ధ్రువీకరణ పత్రాల్లో లోపం 30శాతం ఉంటే డబ్బులు తీసుకొని 70శాతం ఉన్నట్లుగా సర్టిఫికెట్లు ఇప్పించినట్లుగా తెలిసింది. దీంతో అన్ని అర్హతలు ఉన్నా తమకు మాత్రం పింఛన్లు రావడం లేదని పలువురు బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు గ్రామంలో దివ్యాంగుల ధ్రువీకరణపత్రాలపై విచారణ చేస్తే అసలు విషయం బయటపడుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

గాయపడిన యువకుడు మృతి


ఏవేలు (ఫైల్)

గరిడేపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన వంగాల ఏవేలు(24) ఈ నెల 28న తన స్నేహితుడు రామాచారితో కలిసి బైక్‌పై గరిడేపల్లి మండలం మర్రికుంట గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మర్రికుంట గ్రామ సమీపంలో గేదెలు అడ్డురావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కనే కిందపడ్డారు. ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న ఏవేలు తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అతడిని 108 వాహనంలో మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బంధువులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి వంగాల కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

కోడలు మృతికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు

గుండాల : కోడలు మృతికి కారకుడైన మామకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ సోమవారం భువనగిరి కోర్టు తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మురారిపల్లి గ్రామానికి చెందిన మాధవికి గుండాల మండలం నూనెగూడెం గ్రామానికి చెందిన అండెం నర్సిరెడ్డితో 2011వ సంవత్సరంలో వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు జన్మించిన తర్వాత మాధవికి అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో ఆమె ఇంటి వద్దనే ఉంటోంది. కాగా, మామ అండెం సత్తిరెడ్డి వ్యవసాయ పనులకు వెళ్లాలని నిత్యం కోడలిని వేధిస్తున్నాడు. మామ పోరు భరించలేని మాధవి 2017 జూలై 25న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జనగామ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిరోజులకు మాధవి మృతిచెందింది. మృతురాలి తల్లి అనుముల రాధ ఫిర్యాదు మేరకు గుండాల పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదనల అనంతరం నేరం రుజువుకావడంతో భువనగిరి జిల్లా జడ్జి బాలభాస్కరరావు నిందితుడిని ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని గుండాల పోలీసులు తెలిపారు.

భూపోరాటం మళ్లీ మొదలైంది

- ప్రజాయుద్ధ నౌక గద్దర్
- భువనగిరిలో రీజినల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితుల దీక్షకు సంఘీభావం



భువనగిరి కలెక్టరేట్ వద్ద రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితుల దీక్షలో మాట్లాడుతున్న గద్దర్

సాక్షి, యాదాద్రి: భూపోరాటం మళ్లీ మొదలైందని ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్నారు. భూమి సమస్య తెలంగాణ సమస్య అని మహాభారత కాలం, నిజాం కాలం నుంచి నేటి వరకు భూమి సమస్య ఉందన్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని భూనిర్వాసితులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. ధరణి పేరుతో తెలంగాణలో పెద్దకుట్ర జరిగిందని, పెట్టుబడి సాయంతో పంట భూములను బీడు భూములుగా మార్చారన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్, కేటీఆర్‌లు 25 లక్షల ఎకరాల భూములను మింగేశారన్నారు. కేటీఆర్ బంజారా భూములను గుంజుకుని అమెజాన్ సంస్థకు అమ్మేశారన్నారు. కార్పొరేట్ శక్తులకు భూములను ఇవ్వడంపై ప్రజలు తిరుగుబాటు చేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన భువనగిరి నుంచే మరో భూపోరాటం ప్రారంభం కావాలన్నారు. పదేళ్ల పాలనలో రైతులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారన్నారు. భూములు తీసుకోవడం ప్రభుత్వం వెంటనే ఆపివేయలన్నారు. రీజినల్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌మార్చాలని డిమాండ్ చేశారు. లేదంటే రాజ్యాంగం ప్రకారం ఎకరం భూమికి.. మూడు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. నష్టపోతున్న రైతులు వచ్చే ఎన్నికల్లో నామినేషన్లువేసి తమ సత్తాను చూపాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటు అనే ఆయుధంతో పోరాడి మరో విప్లవాన్ని తీసుకురావాలని గద్దర్ ప్రజలను కోరారు.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- రూ.24 లక్షల విలువ చేసే 120కిలోల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర


పట్టుబడిన నిందితులు, గంజాయి ప్యాకెట్లతో డీసీపీ రాజేష్‌చంద్ర, ఇతర పోలీస్ సిబ్బంది

భువనగిరి : గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 120కిలోల గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తన కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి భువనగిరి డీసీపీ కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని ఉస్మానాబాద్‌కు చెందిన రాజు షిండే, సంజయ్ చవాన్, శ్రవణ్ చున్నీలాల్ శర్మ, రాహుల్ షిండేలు ఇదే రాష్ట్రానికి చెందిన ముక్తార్ సూచన మేరకు గంజాయిని రవాణా చేస్తున్నారు. ఇదే క్రమంలో ఇటీవల నలుగురు నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి కారులో మహారాష్ట్రకు బయలుదేరారు.

పోలీసులకు సమాచారం అందడంతో..

అయితే, గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు భువనగిరి ఎస్‌ఓటీ పోలీసులతో పాటు రామన్నపేట పోలీసులు ఈ నెల 28న రామన్నపేట పట్టణ కేంద్రంలో చిట్యాల-భువనగిరి రోడ్డు మార్గంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చిన కారును ఆపి అందులో ప్రయాణం చేస్తున్న నలుగురుని విచారించారు. దీంతో కారులో గంజాయి ఉన్నట్టుగా గుర్తించి వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి సుమారు రూ. 24 లక్షల విలువ చేసే 120 కిలోల గంజాయి ప్యాకెట్లు, మూడు సెల్ ఫోన్లు, కియా కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సోమవారం వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గంజాయి సరఫరా చేస్తూ ఇతరుల సూచన మేరకు అందజేస్తుంటారు. ఎవరి సూచన మేరకు వీరు గంజాయి సరఫరా చేస్తున్నారో దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. గంజాయిని పట్టుకుని పోలీసు సిబ్బందిని అయన అభినందించారు. సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, రామన్నపేట సీఐ మోతీరాం, ఎస్‌ఓటీ సీఐ నవీన్‌కుమార్ ఉన్నారు.

కుళ్లిపోయిన స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం


శివసాయి (ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లి స్టేజీ సమీపంలో సోమవారం కుళ్లిపోయిన స్థితిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయిగిరి-మోత్కూరు రోడ్డు పక్కన ఆత్మకూరు(ఎం) మండల పరిధిలో రాయిపల్లి స్టేజీ సమీపంలో మూలమలుపు వద్ద దుర్వాసన వస్తుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా కుళ్లిపోయిన మృతదేహం కనిపించింది. మృతదేహం పక్కన బైక్‌తో పాటు స్వీచ్చాఫ్ అయిన సెల్‌ఫోన్ పడి ఉంది. రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎవరూ చూడకపోవడంతో కుళ్లిపోయినట్లు తెలుస్తోంది. లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా, మృతదేహం ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రానికి మొరిగాడి శివసాయి (21)గా పోలీసులు గుర్తించారు. ఫ్లవర్ డేకరేషన్ పనులు నిర్వహిస్తుంటాడు. శ్రీను తండ్రి మొరిగాడి మల్లేశం-తల్లి శారద కొంతకాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శ్రీను నాయనమ్మ వద్దే ఉంటున్నాడు. ఈ నెల 22న ఫ్లవర్ డెకరేషన్ ఓనర్ వాసం ప్రసాద్‌కు చెందిన బైక్‌ను తీసుకుని బయటకు వెళుతున్నానని నానమ్మకు చెప్పి వెళ్లాడు. రాయిపల్లి రోడ్డు మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెంది ఉంటాడని బంధువులు పేర్కొంటున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు పానగాని శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


సిద్ధార్థ (ఫైల్)

సూర్యాపేట క్రైం : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేటలో సోమవారం వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..జిల్లా కేంద్రానికి చెందిన వసంతపు సిద్దార్థ పిల్లే(38) వాణిజ్య భవన్ సెంటర్‌లో మీ సేవ కేంద్రం నిర్వహిస్తున్నాడు. అయితే, కొంత కాలంగా కుటుంబంలో ఆస్తి తగాదాలు జరుగుతుండడంతో సిద్దార్థ మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, మిత్రులు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా సిద్దార్థ ఫ్యాక్‌కు ఉరివేసుకొని వేలాడుతున్నాడు. కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి మంత్రి చేయూత


గాదె వనమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: అసలే పేదరికం.. పైగా మగదిక్కు లేని సంసారం.. అందులో ముగ్గురు ఆడబిడ్డలు.. ఎలాగోలా ఇద్దరు బిడ్డల వివాహం చేసిన ఆ తల్లి మూడో బిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ సోమవారం సూర్యాపేటలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని కలిసి పెళ్లి కార్డు అందజేసింది. ఆమె పేదరికాన్ని గమనించి నేనున్నాను బాధపడొద్దని ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక సహాయం అందజేసి ఆదుకున్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కోమటికుంట కు చెందిన గాదె వనమ్మ భర్త మృతిచెందడంతో వంట మాస్టర్‌గా పనిచేస్తూ తన ముగ్గురు ఆడపిల్లలను పోషించుకుంటూ జీవితాన్ని కొనసాగిస్తోంది. ముగ్గురు ఆడబిడ్డల్లో చిన్న బిడ్డ వికలాంగురాలు కావడంతో మొదటగా ఆమెకు వివాహం చేసి ఆ తర్వాత పెద్దమ్మాయికి చేసింది. ప్రస్తుతం మరో అమ్మాయి ప్రతిభ వివాహం జూన్ 1న జరగాల్సి ఉండగా మంత్రిని కలిసి విన్నవించగా వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందజేశారు. అడిగిన వెంటనే తన కుమార్తె వివాహానికి ఆర్థికసాయం చేసిన మంత్రికి ఆ తల్లి ధన్యవాదాలు తెలుపుతూ జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొంది.

అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- యువకుడిపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్.. పరిస్థితి విషమం

మిర్యాలగూడ అర్బన్: కారు వేగంగా వచ్చి అదుపు తప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ పక్కకు దూసుకెళ్లి వాకింగ్ చేస్తున్న యువకుడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని నార్కట్‌పల్లి- అద్దంకి బైపాస్‌రోడ్డుపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట రిలయన్స్ బంక్ సమీపంలోకి రాగానే అదుపు తప్పి ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ వేగంగా పక్కకు దూసుకెళ్లి రోడ్డు పక్కనే వాకింగ్ చేస్తున్న వాసవీనగర్ కు చెందిన నరేష్‌ను ఢీకొట్టింది. దీంతో యువకుడికి తీవ్ర ట్రాక్టర్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారు బెలూన్ తెరుచుకోవడంతో అందులో ఉన్న వారికి ప్రమాదం తప్పింది. రహదారిపై కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాగా నరేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని టుటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు గొర్రెలకాపరి మృతి


గణేష్ (ఫైల్)

తుర్కపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వెంకటాపురంలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుంటి నాగరాజు, లావణ్య దంపతుల కుమారుడు గుంటి గణేష్(20) గొర్రెల కాపరి. రోజూ మాదిరిగానే గొర్రెలను మేపడానికి తమ వ్యవసాయ బావి సమీపంలోకి తోలుకెళ్లాడు.సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా తోక చెరువు సమీపంలోని ఓ చెట్టు కిందికి గణేష్ వెళ్లాడు. గణేష్ నిల్చున్న సమీపంలోనే పిడుగు పడగా దాని ప్రభావంతో అతడు మృతిచెందాడు. పరిసర ప్రాంతంలోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మృతుడి తల్లిదండ్రులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గణేష్ జీవించి ఉన్నాడేమోనని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. నాగరాజుకు కూతురుతో పాటు కుమారుడు గణేష్ సంతానం. చేతికందిన ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

పలువురు ఎస్‌ఐలకు స్థానచలనం

నల్లగొండ క్రైం: నల్లగొండ జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐలకు స్థానచలనం కల్పిస్తూ ఎస్పీ అపూర్వరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీకాంత్‌గౌడ్ కేతేపల్లికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న అనిల్‌రెడ్డిని అనంతగిరి పోలీస్‌స్టేషనర్‌కు బదిలీ చేశారు. మఠంపల్లి ఎస్‌ఐ రవిని చిట్యాలకు స్థాన చలనం కల్పించగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్.ధర్మాను తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌కు అలాట్ చేశారు. అయితే రవి కొద్ది రోజుల క్రితమే తిప్పర్తికి బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వాసప్రవీణ్‌కుమార్ డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

- మరో నలుగురికి గాయాలు


బాబు (ఫైల్)

చౌటుప్పల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. చౌటుప్పల్, భువనగిరి, సంస్థాన్ నారాయణపురం మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెం గ్రామంలో నివాసం ఉండే గాడ్డుల బాబు(27) ఆదివారం ఉదయం సొంతూరైన చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి వచ్చాడు. అదే రోజు రాత్రి బైక్‌పై తిరిగి కొత్తగూడేనికి బయలుదేరాడు. మార్గమధ్యలో దండుమల్కాపురం గ్రామ శివారులో ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, ఎలాంటి సిగ్నల్ లేకుండానే వాహనాన్ని హైవేపై నిలిపాడు. ఈ క్రమంలో బాబు బైక్ వెనుక నుంచి లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం అంబులెన్సులో చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాబు చనిపోయినట్టుగా నిర్ధారించారు. మృతుడి తమ్ముడు సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని..


శ్రీధర్ (ఫైల్)

భువనగిరి : మండల పరిధిలోని కూనూరు గ్రామానికి చెందిన వడ్డి శ్రీధర్(23) పనినిమిత్తం ఇంటినుంచి బైక్‌పై రాయగిరికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాయగిరి గ్రామ సమీపంలో టిప్పర్ సైడు నుంచి శ్రీధర్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీధర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇదే సమయంలో కూనూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తి టీవీఎస్ వాహనంపై వెళ్తున్నాడు. ఇతని వాహనానికి మృతుడి వాహనం తగలడంతో స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై దిలీప్‌కుమార్ తెలిపారు. కాగా మృతుడి తండ్రి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు.

నారాయణపురంలో..

సంస్థాన్ నారాయణపురం : నల్లగొండ జిల్లా బుద్ధారం గ్రామానికి చెందిన మోహన్, తన భార్య గీతాంజలి, కుమారులు హర్షవర్ధన్ (12), సతీష్‌తో కలసి స్కూటీపై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో సంస్థాన్ నారాయణపురం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ వీరి స్కూటీని ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీపై ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

'సెవెన్ స్టార్'లో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

- ఉచిత విందుభోజనం ఏర్పాటు చేసిన హోటల్ యాజమాన్యం


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సెవెన్ స్టార్ హోటల్ సిబ్బంది

సూర్యాపేట రూరల్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు శతజయంతిని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణ పరిధిలోని రాయినిగూడెం గ్రామ సమీపంలో గల సెవెన్ స్టార్ హోటల్‌లో వినియోగదారులకు ఈనెల 26నుంచి ఉచితంగా ప్రత్యేక విందు భోజనం(వెజ్) పెడుతున్నారు. ఎన్టీఆర్‌కు ఎంతో ఇష్టమైన జున్ను, పూర్ణం, గోంగూర పచ్చడితోపాటు అన్నం, ఇతర ఆహార పదార్థాలను ఉచితంగా అందిస్తూ తమ నాయకుడిపై అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 31వరకు కొనసాగిస్తామని హోటల్ యాజమాన్యం తెలిపింది.

వివాహితను వేధిస్తున్న యువకుడిపై కేసు

యాదగిరిగుట్ట రూరల్: వివాహితను వేధిస్తున్న యువకుడిపై సోమవారం యాదగిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గౌరాయపల్లి గ్రామానికి చెందిన మంచు ఉదయ్ అదే గ్రామానికి చెందిన వివాహితను కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. అతడి వేధింపులు తాళలేక సదరు మహిళ సోమవారం యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఉదయ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోదాడలో అనసూయ సందడి


అభిమానులతో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న సినీనటి అనసూయ

కోదాడ: సినీనటి అనసూయ సోమవారం కోదాడలో సందడి చేశారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన యువతి వస్త్ర దుకాణాన్ని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దుకాణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అభిమానులతో సెల్ఫీలు దిగి వారిని ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎంపీపీ చింతా కవిత, చందు నాగేశ్వరరావు, వెంపటి మధు, తుమ్మలపల్లి భాస్కర్, అజంతా, కోళ్ల ప్రసన్నలక్ష్మి, ఖదీర్, మదీనామీరా పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

చౌటుప్పల్ : ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన బాడూరి వెంకటేశం(41) చేనేత వృత్తిపై జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఈనెల 27న తన సెల్‌ఫోన్‌ను ఇంట్లో వదిలి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని తమ్ముడు నాగభూషణ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ సీత పాండు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న కోట గోపి

దురాజ్‌పల్లి(సూర్యాపేట): జూన్ 5 నుంచి 7వ తేదీ వరకు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగే కేవీపీఎస్ రాష్ట్ర సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్య విలువలను రక్షించుకోవడానికి సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలనే లక్ష్యంతో ఈ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నందిగామ సైదులు, దుర్గారావు, నాగమణి, రమణ, గిరి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నిరంకుశత్వంపై పోరాడుదాం

దురాజ్‌పల్లి(సూర్యాపేట): ప్రధాని నరేంద్రమోదీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక పిలుపునిచ్చారు. ఢిల్లీలో మహిళా రెజ్లర్లను ఈడ్చుకెళ్లిన పోలీసుల తీరు నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో మోదీ దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, జిల్లా కోశాధికారి జయమ్మ, శైలజ, సౌందర్య, పీడీఎస్‌యూ నాయకులు సింహాద్రి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ నాయకులు